కథా కౌముది

# యోగి

రవి కొప్పరపు

రాత్రి డేరా లో కూర్చుని ఉన్న బషరత్ ఆలీ, గౌస్ ఖాన్ దగ్గరికి ఒక భటుడు వచ్చాడు.

"ఎవరో కుర్రాడు మన తిరుగుబాటు సైన్యంలో చేరడానికి వచ్చాడండి. పంపమంటారా?"

ఆలీ, ఖాన్ వైపు చూసి భటుడి తో "సరే పంపు" అన్నాడు. భటుడు కొంతసేపైన తరువాత సన్నగా ఉన్న ఒక కుర్రాడితో లోపలికి వచ్చాడు. గౌస్ ఖాన్, బషరత్ ఆలీ ఆ కుర్రాడ్ని పరీక్షగా చూసారు. మాసిపోయిన బట్టలు, పెరిగిన కొంచెం గడ్డం. ఏదైనా తిని చాలా రోజులైనట్టుంది.

"నీ పేరు?" ఖాన్ అడిగాడు

"హరిభావ్ భూసరి"

"వయస్సు?"

"పంతొమ్మిది సంవత్సరాలు"

"నీకిక్కడ పనేంటి, ఎందుకొచ్చావ్?"

"రాణీ లక్ష్మీ బాయ్ సైన్యం లో చేరి, సిపాయిల తిరుగుబాటు లో పోరాడదామని వచ్చా."

ఆలీ చిన్నగా నవ్వి "నువ్వు గట్టిగా గాలి వీస్తే పడిపోయేలా ఉన్నావ్. నువ్వు మా సైన్యంలో ఏంచేస్తావ్? వెళ్ళు, కావాలంటే తాత్యా టోపే దగ్గర చేరు. ఏదైనా మొయ్యడానికి పనికొస్తావ్. ఇక్కడ మేమే చాలా ప్రమాదంలో ఉన్నాం"

"నేను మీలాగే రాణీ గారి సైన్యం లో ఉంటాను. ఆంగ్లేయులని గ్వాలియర్ నుండి, ఝాన్సీ నుండి తరిమెయ్యడానికి ఏదైనా సహాయం చేస్తాను. కత్తి యుద్ధం నేర్చుకున్నాను, వలలు పన్నడం వచ్చు. నన్ను చేర్చుకోండి, మీ దారికి అడ్డు రాకుండా సహాయ పడతాను"

ఖాన్, ఆలీ వైపు చూస్తూ "వీడు గూఢచారి కాదని నమ్మకమేంటి? చేరి వెన్నుపోటు పొడిస్తే? ఈ సమయంలో కొత్త వాళ్ళని చేర్చుకోవడం వద్దు. ఎవరినీ నమ్మడానికి వీలు లేదు"

ఆలీ ఆ కుర్రాడి వైపు చూసి, కొద్ది క్షణాల తరువాత అడిగాడు,

"ఏ ఊరు మీది?"

"పర్భణి జిల్లా లో పత్రి అనే ఊరు."

"అంటే అహ్మద్ నగర్ కి దగ్గరన్న మాట" అన్నాడు ఖాన్, ఆలి వైపు ఓరకంట చూస్తూ

"కాదండి, నాందేడ్ కి దగ్గర, ఆంధ్ర దేశ సరిహద్దు మాకు పెద్ద దూరం కాదు"

ఖాన్, ఆలీ ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు

"ఇంతకు ముందు ఏం పని చేసావు? యుద్ధ విద్యల లో శిక్షణేమైనా తీసుకున్నావా?"

కొంచెం తటపటాయించాడు కుర్రాడు. గౌస్ ఖాన్ మళ్ళీ అడిగాడు ఏంచేసేవాడివని. అతను నసుగుతూ చెప్పాడు,

"కొంతమంది ఫకీరుల తో దేశాటన చేశాను...వాళ్ళ దగ్గరే కత్తి సాము నేర్చుకున్నా."

ఆలీ, ఖాన్ ఇద్దరూ పెద్దగా నవ్వారు.

"ఫకీరులతో తిరిగావా..హ హ హ....యుద్ధంలో పోరాడమంటే మాయలు, మంత్రాలు చదవడం, దేవుడిని ప్రార్థించడం కాదు. సరే..కత్తి యుద్ధం వచ్చన్నావ్ కదా, ఏదీ నాకు చూపించు" అని ఒక కత్తి ఇచ్చాడు ఖాన్.

భూసరి కత్తి పట్టుకొని నిల్చున్నాడు. ఖాన్ కత్తి తీసుకొని కుర్రాడి ముందుకు వచ్చి "కానివ్వు" అన్నాడు.

భూసరి కత్తిని మెరుపు వేగంతో ఖాన్ మీదికి తిప్పాడు. అది ఊహించని ఖాన్ తడపడి, వెంఠనే తేరుకొని తన కత్తి అడ్డం పెట్టాడు. కొద్దిగా ఆలశ్యం అయ్యుంటే కోసుకుపోయేది. బషరత్ ఆలీ చూస్తూ వుండి, కదలక కూర్చున్నాడు.

"పరవాలేదు, కత్తిలో వేగం వుంది. మరి నైపుణ్యం వుందేమో చూద్దాం" అన్నాడు ఖాన్.

భూసరి వెనక్కి తగ్గి నిల్చున్నాడు. ఖాన్ ముందుకు వచ్చి తన కత్తి తో దాడి చెయ్యబోతే, భూసరి తప్పించుకొని ఖాన్ కత్తిని కొట్టబోయాడు. అది గమనించే, ఖాన్ మళ్ళీ దాడి చేసాడు. ప్రతి దాడి కి భూసరి దగ్గర సమాధానం వుంది. ఖాన్ ఎంత ప్రయత్నించినా ఆ కుర్రాడిని ముట్టుకోలేకపోయాడు. ఖాన్ కి, ఆలీ కి అర్థం అయ్యిందేంటంటే భూసరి కత్తి తో దాడి చెయ్యలేదు. అలాగని ఎలా దాడి చేసినా అడ్డుకోగలడు. అంటే భూసరి గెలవడానికి ప్రయత్నిచట్లేదు. ప్రత్యర్థి తో ఎప్పుడూ సమానం అవుతూ వస్తూ ఉన్నాడు. ఇదొక వ్యూహం అన్న మాట. అంటే ప్రత్యర్థి తో ఎప్పుడూ సమానం అవుతూ వచ్చి, చివరికి విసిగించి, అలిసిపోయేలా చేసి అప్పుడు దాడి చేసి గెలవడం.

సమయం గడుస్తున్నకొద్దీ అదే నిజమయ్యేలా వుంది. ఖాన్ కి అసహనం పెరిగి పోతూ వుంది. ఎంతకీ ఎవరు విజేతో తెలియట్ల. చివరికి ఒక్క క్షణం సహనం కోల్పోయి పొరపాటు చేసాడు. అంతే, అదే అదనుగా భూసరి తన కత్తి ని ఖాన్ మెడ మీద పెట్టాడు. ఇదంతా చూస్తున్న బషరత్ ఆలీ పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొట్టి నిల్చుని,

"శెహభాష్, నీ వ్యూహం చాలా కొద్ది మందికే తెలుసు. ఆ ఫకీరులెవరో ప్రార్థన తో పాటు నీకు ఉపయోగపడేది కూడా నేర్పించారు"

భూసరి కొంచెం ఆయాస పడుతూ "దీనితో పాటు, తత్వ శాస్త్రం లాంటివి కూడా నేర్పించారు"

ఖాన్ ముందు కు వచ్చి "ఆ శాస్త్రాన్ని యుద్ధం లో వినిపించి, ప్రత్యర్థులని విసిగించి ఓడిస్తావా, నీ కత్తి యుద్ధం లాగా?" అన్నాడు

ఆలీ మరో సారి బిగ్గరగా నవ్వుతూ

"విసుక్కోకు మిత్రమా, ఈ కుర్రాడు మనకి ఉపయోగ పడతాడు. చూడు...పేరేంటన్నావ్? ఆ, భూసరి, నీకు నైపుణ్యం వుంటే సరిపోదు. అన్నికంటే నీ మీద నమ్మకం కలగాలి. అది వుంటే నువ్వు ఇక్కడ వుంటావ్. లేదంటే, నిన్ను నేనే స్వయంగా మట్టుబెడతా? అర్థమయ్యిందా?"

తలూపాడు భూసరి.

"రాణీ లక్ష్మీ బాయి వీరనారి, దేశానికి ఎంతో ముఖ్యమైన యోధ్ధురాలు. ఆవిడ సమ్రక్షణ మా భాధ్యత. ఆవిడని కాపాడటం కోసం దేనికైనా సిధ్ధం మేము. నిన్ను ఇప్పుడప్పుడే ఆవిడకి రక్షణగా వుంచము. ముందు నువ్వు మాతో పాటు ఆంగ్లేయులతో పోరాడు. ఈ సిపాయిల తిరుగుబాటు ఉద్యమం  ఇంకా పెరుగుతుంది. అప్పుడు నీ అవసరం వుండొచ్చు. కాలం గడిచే కొద్దీ నువ్వేంచేస్తావో చూస్తాము" అన్నాడు ఖాన్.

"దేశాన్ని కాపాడ్డానికి నేను సిధ్ధం. రాణీ గారి గురుంచి చాలా మంది కథలుగా చెప్పుకుంటున్నారు నేనుండిన ఊళ్ళో. ఆవిడే నాకు ప్రేరణ. మీరు ఏం చెయ్యమన్నా దానికి నేను ముందుంటాను"

ఆలీ, ఖాన్ ఇద్దరూ చిన్న గా నవ్వారు.

"రేపటి నుండి సైన్యం లో చేరు"

★★★★★★★

భీకరమైన యుద్ధం జరుగుతోంది గ్వాలియర్ దగ్గర ఉన్న ఫూల్ బాగ్ లో. లక్ష్మీ బాయి ఆధ్వర్యం లోని సేనలు కెప్టెన్ హెనియేజ్ దళాల తో హోరాహోరీ పోరాడుతున్నారు. రాణీ గారు చెలరేగిపోయి చేస్తున్న పోరాటాన్ని చూడటానికి రెండు కళ్ళు చాలవు. తన రెండు చేతులలో రెండు ఖడ్గాలు పట్టుకొని శత్రు వినాశనం చేస్తున్న తీరు మనం చిత్రపటాల్లో చూపే వీరత్వం అస్సలు సరిపోదు.  ఆ సమయంలో రాణి గారిని చూసిన వారికి ఉద్వేగపూరితమైన ఉత్తేజం కలగక మానదు. ఇంకొక చోట బషరత్ ఆలీ తన శక్తి మేర రాణీ గారిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని హెనియేజ్ దళాల జోరు ఎక్కువైపోయింది. ఎవరో ఇద్దరు తుపాకులు పట్టుకొని రాణీ గారి వైపు వెళ్ళడం చూశాడు. రాణీ గారు ప్రమాదం లో ఉన్నారని గ్రహించి, ఆలీ గట్టిగా అరిచాడు,

"భూసరి.. రాణీ గారిని కాపాడు...త్వరగా"

భూసరి తిరిగి ఒక్క అడుగు వేసాడో లేదో, తుపాకి పట్టుకున్న ఒకతను రాణీ గారి వైపు గురి పెట్టి కాల్చాడు.....

ఏదైతే జరగకూడదని అనుకున్నారో, అదే జరిగింది...భూసరి నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు. ఎంత సేపు గడిచిందో తెలియదు. ఆలీ ఏదో అరుస్తున్నా వినే స్థితిలో లేదు. కళ్ళ ముందు జరిగింది నమ్మ బుధ్ధి కావటం లేదు. అలా నుంచుని చుట్టూ చూస్తుంటే అతనికి కనిపించేదంతా ఘోర కలి. రక్తమోడుతున్న శరీరాలు, అవయవాలు పోయిన మానవ కళేబరాలు, హాహాకారాలు. ఏమిటిది? ఎంత మంది జీవితాలు నాశనమయ్యాయి? తను ఎంతో ఆరాధించే రాణీ గారు కూడా....కుప్ప కూలి మోకాళ్ళ మీద కూర్చున్నాడు. కత్తి చేతిలో నుండి పడిపోయింది. ఇంకా ఎంత కాలం ఈ నరకం? ఎంత మందికి ఈ నరకం? వీరికీ, వీళ్ళ కుటుంబాలకి తనేం చెయ్యగలడు? ఓదార్పు తప్ప? అదేం సరిపోతుంది?...తల కిందకు దించుకుని కూర్చున్నాడు. ఇంతలో ఎవరో దుస్తులు పట్టుకొని పక్కకి తీసుకెళ్ళి పోయారు.

★★★★★★★

నెల రోజులయ్యింది యుద్ధాన్ని వీడి. ఎక్కడెక్కడో తిరిగాడు భూసరి. చివరికి రాణీ గారి సైన్యం లో చేరక ముందు తనున్న ఊరొచ్చి, ఆ ఊరి చివర్లో చెట్టు కింద కూర్చుని ఆలోచనలో మునిగిపోయాడు. ఎక్కడ చూసినా, ఏ ఊరెళ్ళినా జనాల బాధలే. వాటికి కారణం కూడా ఒకరి మీద ఒకరికి ప్రేమ లేకపోవడం, అత్యాశ. ఎంత సేపయ్యిందో తెలియలేదు. ఆకలేసింది. తినడానికి ఏమీ లేదు.  ఆ ఊర్లో భిక్షాటనకి బయల్దేరాడు. ఎవరో దయ తలిచి కొంచెం భోజనం పెట్టారు. తన దగ్గరున్న పొడుగు తెల్ల కండువా కప్పుకొని ఆ చెట్టు కిందే పడుకున్నాడు.

ఇదే దినచర్య. నిద్ర లేచి, దగ్గర్లో వున్న చెరువు దగ్గరికి వెళ్ళి, కాలకృత్యాలు అయ్యిన తరువాత, చెట్టు దగ్గర కూర్చొని సుదీర్ఘమైన ఆలోచనలో ఉండడం, ఆకలేసినప్పుడు భిక్షాటన చెయ్యడం, మళ్ళీ ఆలోచనలు....ఇలా నెలయ్యేసరికి ఆ ఊళ్ళో ఉన్నవాళ్ళు మెల్లగా గమనించడం మొదలెట్టారు. ఎవరితను, ఫకీరు లాగున్నాడు? ఎవ్వరితోను మాట్లాడటం లేదు. భిక్షాటనకు మాత్రమే ఊళ్ళో కనిపిస్తున్నాడు. పిల్లలు ఎవరో పిచ్చోడని గేలి చేసారు. పెద్ద వాళ్ళు కొందరు అనుమానపడ్డారు. కాని అతని లో ఏదో తెలియని ఆకర్షణ. ప్రశాంతమైన మోము.

ఒక రోజు మధ్యాన్నం భిక్షాటన అయ్యిన తరువాత, కూర్చోవడానికి దగ్గరిలో ఉన్న గుడి కి వెళ్ళాడు. అక్కడ కూర్చుని, వున్నది తిని నీళ్ళ కోసం చూస్తే గుడి పూజారి కనిపించాడు. అతన్ని నీళ్ళడిగితే, అతను నీళ్ళిచ్చాడు. తాగి ధన్యవాదాలు, చెప్పాడు. అప్పుడు పూజారి దగ్గరగా వచ్చి అన్నాడు,

"లోపలికి రండి సాయి. ఈ షిరిడి లో ఎండ కొంచెం ఎక్కువ. కాసేపు విశ్రాంతి తీసుకుందురుగాని"

★★★

**Click here to share your comments on this story**